## పంటలపై ఆగని ఏనుగుల దాడులు

రామకుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



బీన్స్ పంటను ఏనుగులు ధ్వంసం చేసిన దృశ్యం

మండలంలోని సింగసముద్రం పంచాయతీ చింతమానత్తం గ్రామ సమీపంలో శనివారం రాత్రి మూడు ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. చంద్రారెడ్డి, ప్రభ నాయుడులకు చెందిన బీన్స్, కొబ్బరి చెట్లను నాశనం చేశాయి.గత కొన్నాళ్లుగా ఆగిన ఏనుగుల దాడులు మరలా మొదలయ్యాయి. అటవీ అధికారులు ఏనుగుల దారి మళ్లింపుకు చర్యలు చేపట్టినా అవి అటవీ ప్రాంతంలోనే మకాం పెడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గోవిందుని చెంత రాష్ట్రపతి ముర్ము

### -నేటి ఉదయం శ్రీవారి దర్శనం



తిరుమలకు చేరుకున్న దేశ రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఇఓ ధర్మారెడ్డి



రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీసిఎం నారాయణస్వామి, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:
దేశ ప్రధమపౌరురాలు ద్రౌపది ముర్ము వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. అత్యంత భద్రత నడుమ రాష్ట్రపతి పద్మావతి అతిధి గృహంలో విడిది చేశారు.సోమవారం ఉదయం ఆమె శ్రీవారినిదర్శించుకుని ఆశీస్సులందుకుంటారు. భద్రత పరంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, అదనపు ఎస్పి మునిరామయ్య, తిరుమల 1టౌన్ సిఐ పి.జగన్మోహన్‌రెడ్డి, శ్రీవారి ఆలయం, పరిసరాలు,పద్మావతి అతిధి గృహం ప్రాంతాలు వద్ద గట్టి బందోబస్తు చేశారు.

# రచ్చకెక్కిన ఆస్తి తగాదాలు

### ఎంఎల్ఏ వర్సెస్ బామ్మర్ది

### తలలు పట్టుకుంటున్న అధికారులు





మాట్లాడుతున్న సామాను నారాయణరెడ్డి, బ్లేడుతో చేతులు కోసుకున్న శ్రీధర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త
పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో రెండు రోజులుగా ఎంఎల్ఏ బామర్ధి శ్రీధర్‌రెడ్డి సాగిస్తున్న ఆస్థితగాదాలొల్లి అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పట్టణంలోని టీదుకాణాలు, కిళ్ళాషాపులు, కూడలి ప్రాంతాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి బావమరిది సామానుశ్రీధర్‌రెడ్డి ఎంఎల్ఏ బెదిరిస్తున్నారని, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆస్తికోసం తనను, తన కుటుంబాన్ని వీధిపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాడంటూ ఎంఎల్ఏ ఇంటి ముందు ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. విచారణకు వచ్చిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎంఎల్ఏ బంట్లు అని దూషించారు. తోటలోని తన ఇండ్లను ఖాళీ చేయకుంటే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటామని ప్రకటించారు. ఈ అంశం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అయితే సమయస్ఫూర్తి కలిగిన శాసనసభ్యుడు ఈ అంశానికి సంబంధించి పెదవి విప్పలేదు.. పట్టించుకోలేదు. దీంతో ఆదివారం శాసనసభ్యుడు మామ శ్రీధర్‌రెడ్డి తండ్రి సామాను నారాయణరెడ్డి ప్రకటన ప్రకంపనలు కల్పించింది. పరిశీలకులను విస్మయానికి గురిచేసింది. అసలేం జరుగుతోందన్న చర్చ చోటుచేసుకుంది. ఆస్తిపై శ్రీధర్‌రెడ్డికి హక్కులేదు. శ్రీధర్‌రెడ్డి తండ్రి సామాను వెంకటనారాయణరెడ్డి ఆదివారం రాత్రి విడుదలచేసిన ప్రకటనలో ఇలా తెలిపారు. పదిహేనేళ్ళక్రితం తన కుమారుడు శ్రీధర్‌రెడ్డి పరిస్థితి బెంగుళూరులో ఉంటున్న తన అల్లుడు బియ్యపుమధుసూధన్‌రెడ్డి, కుమార్తె శ్రీవాణి నడుతున్న కొరియర్ సంస్థలో జీతానికి పనిచేసేవాడని వివరించారు. తన మనుమరాలు పవిత్రారెడ్డి పేరుతో ఏర్పాటుచేసిన రెస్టారెంట్‌లో పనిచేశాడన్నారు. తర్వాత మెడివోవాకంపెనీలో జీతగాడుగా పనిచేశాడని వివరించారు. బావమర్ధి బాగుకోరుతున్న బావ తన అల్లుడు మధుసూధన్‌రెడ్డి, శ్రీవాణి ఆక్సిజన్ అనే మొబైల్ కంపెనీని అప్పగిస్తే దివాలా తీయించారని వివరించారు. 30వేల చదరపు అడుగుల్లో ఇళ్ళు నిర్మించుకుంటూ అమ్మానాన్నలైన తమను తరిమివేశారన్నారు. కోట్లాదిరూపాయల భూముల్ని అమ్ముకుంటున్న శ్రీధర్‌రెడ్డికి ఆభూములు ఎక్కడి నుంచి వచ్చాయో మరచినట్లు ఉందని తండ్రి నారాయణరెడ్డి వివరించారు. తల్లిదండ్రులకు చెందిన 50 ఎకరాల భూమిలో 30 ఎకాలు అమ్ముకున్నాడని నారాయణరెడ్డి తెలిపారు. 2008లో తాను తన కుమార్తె శ్రీవాణికి 10ఎకరాలుపసుపుకుంకుమ కింద దాన్ని సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించానని అందుకు సంబందించిన డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆమె 8ఎకరాలు అమ్ముకుని రెండు ఎకరాల్లో ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. తమ ఆస్తిలో కుమార్తె శ్రీవాణికి కూడా సమాన హక్కు ఉందని వివరించారు. పదేళ్ళుగా లేనిది ఇప్పుడు సమస్య సృష్టిస్తూ రెండు ఎకరాలు కోసం ఆత్మహత్య కోసం డ్రామాలు మంచిది కాదన్నారు. పదేళ్ళుగా ఈడ్రామాలు శ్రీధర్‌రెడ్డి బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యడ్రామాలు అలవాటైందన్నారు. శ్రీధర్‌రెడ్డి కుయుక్తులు చూసి అక్కదూరం పెట్టిందని వివరించారు. ఈఅరాచకాలను చూసి రచ్చకెక్కిన తమను ఇంటి నుంచి బయటకు గెంటివేశారని వివరించారు.

**సుబ్రమణ్యంరెడ్డికి సంబంధం ఏమిటి?**

వివాదాలకు మూలమైన ఆస్తితగాదాలు సంబందించి శ్రీధర్‌రెడ్డి మామ తెలుగుదేశం మద్దతుదారుడు సుబ్రమణ్యంరెడ్డికి సంబందం ఏమిటని నారాయణరెడ్డి ప్రశ్నించారు. ఇంతకాలం సుబ్రమణ్యంరెడ్డి ఏడు సంవత్సరాల తర్వాత రావడంలో ఆంతర్యమేమిటి? అక్కాతమ్ముళ్ళ మధ్య గొడవలు సృష్టించి రాజకీయంగా తన అల్లుడు మధుసూధన్‌రెడ్డిపై బురద చల్లడానికి వచ్చారని ఆరోపించారు. ఆస్తివివాదాలు రక్తసంబందాలు కూడా తోడవడానికి శ్రీకాళహస్తిసంఘటన నిదర్శనమని చెప్పచ్చు.

## రాష్ట్రపతి పర్యటనలో భాగంగా

# అప్రమత్తంగా ఉండాలి

### భద్రతా సిబ్బందిని ఆదేశించిన అనంతపురం రేంజ్ డిఐజి, జిల్లా ఎస్పి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం డిఐజి రవి ప్రకాష్, జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి

తిరుపతి క్రైం, డిసెంబర్ 4, ప్రభాతవార్త
రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్, జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు యూనివర్సిటీ సెంట్ హాల్‌లో సమావేశంలో దిశా నిర్దేశం చేసారు. రాష్ట్రపతి తిరుపతి పర్యటనను పురస్కరించుకుని భద్రతను కట్టుదిట్టం చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రాష్ట్ర పతి పర్యటించే సమయంలో రహదారులు నందు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని కార్యచరణతో విధులు నిర్వహించాలన్నారు. అలాగే క్యూర్టీ, ఏరియా డామినేషన్ పార్టీ, స్టాటిక్ రోప్ పార్టీలు తరపున సభ ప్రాంగణంలో ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం అనుమతించాలన్నారు. అధికారులు సిబ్బంది విధుల నందు ఎక్కడ కూడా నిర్లక్ష్య ధోరణి అవలంభించరాదన్నారు. భారత రాష్ట్రపతి పర్యటనలో ఎటువంటి ఆటంకాలు ఉండకుండా చిత్తశుద్దితో పనిచేయాలని రాష్ట్రపతి పర్యటించే ప్రాంతంలో ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నటువంటి అధికారులు వాళ్ల యొక్క ప్రాంతాలలు పూర్తిగా ఆధీనంగా ఉండాలని ఏదైనా ఘటనలపై సమాచారం ఉంటే వెంటనే పై అధికారులకు తెలియపరిచి ఎక్కడ కూడా అలసత్వం లేకుండా విధుల నందు అప్రమత్తంగా ఉంటూ రెండు రోజుల పాటు కింది స్థాయి సిబ్బంది నుండి పై స్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పర్యటనను విజయవంతం చేయాలని ఆశా భావాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులతో పాటు బందోబస్తుకు వచ్చిన అధికారులు పాల్గొన్నారు.

## మాంబట్టులో దేశం ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి



తడ, డిసెంబర్ 4 ప్రభాతవార్త
తడ మండలం మాంబట్టు పంచాయతీలో ఆదివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తడ మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని యువత, మహిళలు పెద్దసంఖ్యలో హాజరై ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ నినాదాలిచ్చారు. మాంబట్టు పంచాయతీకి చెందిన వేనాటి రాజారెడ్డి, చిల్లకూరు సురేష్‌రెడ్డిలు ఇద్దరూ కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఎస్ఎం కండ్రిగ, ఎస్టీ కాలనీ, చినమాంబట్టు తదితర చోట్ల నాయకులు ప్రదర్శన చేసి ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా నెలవల, వేనాటిల సమక్షంలో పలువురు టీడీపీలో కొత్తగా చేరారు.

## స్మగ్లర్లను కట్టడిచేయడమే లక్ష్యం!

### ఎస్ఈబి డైరెక్టర్ రవిశంకర్



తిరుపతి, డిసెంబర్ 4ప్రభాతవార్త:
ఎర్రచందనం స్మగ్లింగ్ జరగ కుండా స్మగ్లర్లను ఎక్కడికక్కడ కట్టడిచేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, మూలాలపై నిఘా ఉంచాలని రాష్ట్ర ఎస్ఇబి డైరెక్టర్(టాస్క్‌ఫోర్స్),అదనపు డిజి (శాంతిభద్రతలు) ఏ.రవి శంకర్ ఆదేశించారు. ఆదివారం ఉదయం తిరు టపతికి విచ్చేసిన ఎస్ఇబి డైరెక్టర్(టాస్క్‌ఫోర్స్) రవిశంకర్ కపిలతీర్థంలోని ఎర్రచందనం గోదాములను, టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి చక్రవర్తి, సిబ్బంది స్వాగతం పలికారు.



## కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

-పార్కింగ్ స్థలాల్లో వాహనాల కిటకిట
-క్యూకాంప్లెక్స్ నిండి ఆలయ బయట బారులు తీరిన భక్తులు

## పోరుకు తెలుగుతమ్ముళ్ళు

# సిద్ధమేనా!?



ప్రభాతవార్త–తిరుపతి:
అధికార వైసిపి “గడపగడపకు” కార్యక్రమం....ప్రతిపక్ష టిడిపి “ఇదేంఖర్మరాష్ట్రానికి” నినాదంతో అన్ని ప్రాంతాల్లో ఇంటింటికెళ్ళి ప్రజలను కలుస్తున్నారు. గత మూడున్నరేళ్ళలో జగన్ ప్రభుత్వం ఏం చేసిందనే అభివృద్ధిని అధికార వైసిపి ఎమ్మెల్యేలు, నేతలు ప్రజలకు స్పష్టం చేస్తుండగా, ప్రతిపక్ష పార్టీ నేతలు గత మూడున్నరేళ్ళలో ప్రజావ్యతిరేకత ఏమిటనేది గుర్తించి వివరించాలనేది లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ కార్యక్రమాలతో ప్రజలకు ఇప్పుడు చేరువ కావడానికి టిడిపి నేతలు ఒకింత సుముఖత చూపుతున్నారు. అధికార పార్టీ నేతలు మాత్రం గత మూడునెలలుగా ప్రజలతోనే మమేకమై వారి అవసరాలు, సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకెళుతున్నారు. ఈ కార్యక్రమాలతో ఇరు పార్టీల నేతలు ప్రజలను ఏ మేరకు ఆకట్టుకుంటున్నారనేది ఓటుబ్యాంకుతోనే సమాధానం చెప్పడానికి ప్రజలు సిద్దపడుతున్నారు. రాష్ట్రంలో గడువుమేరకు అయితే 2024లో సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళితే ఇప్పటికిప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంతవరకు అధికార పార్టీని తెలుగుతమ్ముళ్ళు దీటుగా ఎదుర్కోగలరనే చర్చ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలకు 13చోట్ల వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. గత మూడున్నరేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల వల్లగానీ, అధికార ఎమ్మెల్యేలు ప్రజలకు చేరువగా ఉండి కనీస సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేకపోతోందనే విమర్శలతో , పలు కారణాలతో ప్రజల్లో మంచిపేరు లేకపోతోంది.ఉమ్మడి జిల్లాలో ముగ్గురు నలుగురు సిట్టింగ్ఎమ్మెల్యేలు తప్ప మిగిలిన చోట్లంతా అధికార పార్టీపట్ల ప్రజలు మొగ్గుచూపడంలేదనేది విశ్వసనీయ సమాచారం.ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్టీ నేతల,ఎమ్మెల్యేల సమక్షంలో వెల్లడించిన విషయం విదితమే. అయితే ఈ లోపాలను ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగానీ, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, పదవుల్లో ఉన్న కేడర్‌గానీ సరైన పంథాలో ఓటుబ్యాంకుగా మలచుకోలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటింటికీ వెళ్ళి ఆత్మీయంగా ప్రజలను పలకరించాలని ,వారి సమస్యలు తెలుసుకోవాలని ఏకంగా టిడిపి అదినేత చంద్రబాబు సూచనలు కూడా నేతలు పాటించడంలేదనేది పార్టీలోనే రుసరుసలు. అవసరమైన చోట పోరాటానికి దిగాలని బాబు దిశానిర్ధేశం చేసినా తెలుగుతమ్ముళ్ళు సాహసం చేయలేకపోతున్నారు.

# ఇటు వైకాపా గడప గడపకు..
# అటు తెదేపా ఇదేం ఖర్మ రాష్ట్రానికి

- జిల్లాలో జనం మధ్యలోకి వెళ్తున్న అధికార.. ప్రతిపక్ష నేతలు !!
- వేడెక్కుతున్న రాజకీయాలు.. ప్రజల వద్దే తేల్చుకునేందుకు తహతహ !!

కుప్పం, ప్రభాతవార్త
చిత్తూరు జిల్లాలో గతకొంతకాలంగా స్తబ్దుగా ఉన్న రాజకీయాలు వేడెక్కుతున్నాయి. గత మూడున్నర ఏళ్ల పాలనలో ప్రజలకు తాము చేసిన మేలు నేరుగా ప్రజలకే తెలియజేసేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌లు ‘గడపగడపకు మీ ప్రభుత్వం‘ కార్యక్రమాన్ని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్నారు. మరో పక్క ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ నేతలు ఇదేం ఖర్మ రాష్ట్రానికి అంటూ వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లో తీసుకెళ్లేందుకు ఇదేం ఖర్మ కార్యక్రమంను ప్రారంభించారు. దీంతో ఇరు పార్టీల నేతలు జనం మధ్యలో వెళ్తుండడం కొంత రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి. ఇరు పార్టీలు ప్రజల మధ్యనే తమ బలబలాలు తేల్చుకునేందుకు తహతహలాడుతున్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంను విధిగా ప్రతి నియోజకవర్గంలో నిర్వహించాలని ఇప్పటికే ఆదేశించారు. దీంతో జిల్లాలో పలుచోట్ల ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు గడపగడపకు కార్యక్రమం కొనసాగిస్తున్నారు. గడపగడపకు కార్యక్రమంలో పాల్గొంటున్న ఎమ్మెల్యేలకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని వారికి తగు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఖచ్చితంగా జనంలో వెళ్లి ప్రభుత్వ పథకాలను వారికి వివరించి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకోవాలని సిఎం ఇదివరకే ఆదేశించారు. దీంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘నవరతా న్లలు‘ పథకాలతో ప్రజలకు కలిగిన లబ్ధి, ఇతర పథకాలు, కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సాయం, నాడు -నేడు పనులు తదితరాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి కలిగిన లబ్ధిని వివరిస్తున్నారు. గడపగడపకు కార్యక్రమంలో కొంత వెనుకబడిన ఎమ్మెల్యేలకు సైతం ఇదివరకే కొంత హెచ్చరించారు. ఈ కార్యక్రమం నివేదికలు ఎమ్మెల్యేలకు కీలకంగా మారనున్నాయి. దీనికితోడు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవలే శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించారు. దీంతో ప్రతి నియోజకవర్గంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గట్టిగానే దృష్టిసారించారనే చెప్పాలి. టార్గెట్ 175లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. ఇప్పటికే సిఎం రాజకీయ సలహాదారుడు ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ బృందం నియోజకవర్గాలపై నివేదికలు అందించినట్లు సమాచారం. దీంతో ప్రతి నియోజకవర్గంలో విధిగా గడపగడపకు కార్యక్రమం చేపట్టాల్సిందేనని సిఎం ఎమ్మెల్యేలకు ఆదేశించారు. మరో పక్క మూడున్నర ఏళ్లుగా వైకాపా ప్రభుత్వ పాలనలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, అభివృద్ధి కన్పించడం లేదని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఇదివరకే ‘బాదుడే బాదుడు‘కార్యక్రమాన్ని నియోజకవర్గాల్లో నిర్వహించింది. తాజాగా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైకాపా ప్రభుత్వంలో ప్రజలను బాధించే అంశాలు 14గా పేర్కొంటూ వాటిపై నేరుగా ప్రజల ఇంటికెళ్లి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. నిరుద్యోగ సమస్య, నిత్యావసర ధరల పెరుగుదల, మద్యపానం, కుంటుపడిన అభివృద్ధి, ఇసుక మాఫియా, తాగునీటి సమస్య, అవినీతి, మహిళల భద్రత, విద్యుత్, రోడ్ల సమస్యలు, నిధుల దుర్వినియోగం, రాజధాని రాజకీయాలు, నిలకడలేని పాలన, గిట్టుబాటు ధరలు ఇలా 14 అంశాలను ఓ కరపత్రంలో ప్రస్తావిస్తూ వీటిలో ప్రజల అభిప్రాయాన్ని నేరుగా అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు నేరుగా ప్రజల్లోనే తమ సత్తా తేల్చుకుందామని బరిలో దిగారు. ఏది ఏమైనా ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము సిద్ధమే అన్న రీతిలో జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ధీమాగా ఉన్నారు. ప్రజలను ఇప్పటినుంచే ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు - ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్, డిసెంబర్ 4 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంకే గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు.ఆదివారం మిట్టపల్లి పంచాయతీ తిమ్మాపురంలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ధి కలిగిస్తామన్నారు. మూడేళ్ల పాలనలో సిఎం జగనన్న కుప్పం



ప్రజలకు 1143కోట్లు వివిధ పథకాల రూపంలో అందించారన్నారు. గాంధీజీకలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనలో భాగంగా సచివాలయ వ్యవస్థ అందుబాటులో తెచ్చి ప్రజల ముంగిటకే పాలన తెచ్చారన్నారు. ప్రజలు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తి చేసి సాగు,తాగునీరు తప్పక అందిస్తామన్నారు. ప్రజలు కూడా తమకు మేలు కలిగిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, వైస్ ఎంపిపి షౌకత్ అలీ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలిపేందుకే ఇదేం ఖర్మ

- చంద్రబాబు కార్యదర్శి మనోహర్

కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిపేందుకు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టినట్లు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధి తంబిగానిపల్లి, డికెపల్లిలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలో వచ్చిన సిఎం జగన్‌రెడ్డి పాలన చూసి ప్రజలు మరో ఛాన్స్ ఇచ్చే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. మూడున్నర ఏళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు సైతం వేరే రాష్ట్రాలకు తరిమేశారన్నారు. మరో పక్క సంక్షేమ పథకాల పేరిట ప్రజలకు ఓ చేత్తో నగదు ఇచ్చి మరో చేత్తో లాక్కుంటున్నారన్నారు. అధికారంలో రాగానే వృద్ధులకు మూడు వేలు పింఛను ఇస్తానని ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరలా చంద్రబాబునాయుడు సిఎం కావడం తథ్యమన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం తెదేపా నేతలు ప్రతి ఇ ంటికి వెళ్లి వైకాపా పాలనపై పది అంశాల ప్రశ్నలకు సమాధానం రాబట్టారు. కార్యక్రమాల్లో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్,ఆర్ముగ ం, త్రిలోక్, డికెపల్లి మణి, సురేష్‌కుమార్, కాణిపాకం వెంకటేష్, మురుగేష్, నాగభూషణం, లోకేష్,గని, కౌన్సిలర్లు సెల్వరాజ్, వేలు, వేణుగోపాల్, రవి,జయమ్మ, తిరుమగళ్, నబీ

## ద్రవిడ వర్సిటీలో 6నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు

కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీ ప్లేస్‌మెంట్ విభాగం అధ్వర్యంలో ఈనెల 6,7 తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర పొలిటికల్ కన్సల్టెన్సీ వారు రాజకీయ విశ్లేషకుల కోసం ఈ ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. డిగ్రీ, పిజి పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఎంపికలకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తిగల వారు వర్సిటీలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో తమ బయోడేటా, ఫోటోలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కేశవమూర్తి ఫోన్ నెం9440505878నెంబరును సంప్రదించాలని సూచించారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ పరామర్శ

కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని పిబినత్తం పంచాయతీ మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం కుటుంబాన్ని ఆదివారం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పరామర్శించారు. ఇటీవల మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఎమ్మెల్సీ భరత్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాను అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని కుటుంబీకులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఎడిఎస్ శరవణ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్ధగిరి కొండపై వ్యక్తి ఆత్మహత్య

తవణంపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త:

అరగొండ అర్ధగిరి కొండపై ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుని పడివుండగా ఆదివారం స్థానికులు కనుగొన్నారు. మండలంలోని తొడతరకు చెందిన సుబ్రమణ్యం(47) అనే వ్యక్తి ఇంట్లో గొడవపడి గత రెండు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్ళిపోయి జీవితంపై విరక్తితో అర్ధగిరి కొండపై కల్కిభగవాన్ ఆశ్రమం సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈవిషయాన్ని స్థానికులు కనుగొని మృతుడు సుబ్రమణ్యంగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. ఈసంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

## ఘనంగా శ్రీగుర్రప్ప, వెంకటేశ్వర ఆలయ కుంభాభిషేకం

తవణంపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త:

మండలంలోని జొన్నగురకల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగుర్రప్ప, వెంకటేశ్వర ఆలయం కుంభాభిషేకం ఆదివారం శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు ఎ.కేశవులు ఆధ్వర్యంలో జొన ్నగురకల గ్రామంలో గుర్రప్ప, వెంకటేశ్వర ఆలయంను నూతనంగా నిర్మించారు. ఈఆలయ కుంభాభిషేకం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆదివారం వేకువజామున గణపతిపూజ, ప్రత్యేక హోమాలు,మహా పూర్ణాహుతి, నివేధన వంటి పూజాది కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులు అన్నప్రసాద వితరణ గావించారు. ఈకార్యక్రమంలో జొన్నగురకల పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఎద్దఎత్తున పాల్గొని నూతన ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా శనివారం రాత్రి స్వామివారికి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత కేశవులు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం

సదుం,డిసెంబరు4ప్రభాతవార్త

సదుంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మామిడి రైతులకు శిక్షణాకార్యక్రమం ఉంటుందని హార్టికల్చర్ అధికారిణి సంతోషికుమారి తెలిపారు. మామిడిలో పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శాస్త్రవేత్తలు వివరిస్తారని రైతులు అంతా హాజరు కావాలని ఆమె కోరారు.

## బీసీ గర్జన సభకు తరలిరండి

సదుం,డిసెంబరు 4 ప్రభాతవార్త

ఈనెల 7న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే వైఎస్సార్ పార్టీ జయహో బీసీ గర్జనసభకు మండలంలోని బీసీలంతా తరలిరావాలని మండల వైకాపా నాయకుడు రెడ్డెప్పరెడ్డి కోరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బీసీ సర్పంచిలు, బీసీ ఎంపీటీసీలు,మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తరలి వెళ్లాలని 6వ తేదీ సాయంత్రం సదుం నుంచి బస్సు బయలుదేరుతుందని చెప్పారు.

## పంద్యాలమడుగులో ఇదేం ఖర్మ కార్యక్రమం

రామకుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని పంద్యాలమడుగు గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని తెదేపా నేతలు నిర్వహించారు. తొలుత గ్రామంలో పార్టీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం వైకాపా ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాలు పంచారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. కార్యక్రమంలో తెదేపా అధ్యక్ష కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నేతలు ఆంజనేయరెడ్డి,మునస్వామి, గంట్లగౌడు, రామచంద్రారెడ్డి, మంజు, వెంకటాచలం, వెంకటరెడ్డి, మహ్మద్ రఫీ, జ్ఞానేశ్వర్‌రెడ్డి, కామరాజునాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలి

తవణంపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త:

త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి ఆత్మజ్ఞానులు కావాలని త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞానవేదిక-ప్రబోధ సేవాసమితి, బంగారుపాళ్యం-2 కమిటీ అధ్యక్షుడు పుల్లూరు ధనంజయ అన్నారు. సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం-2 సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని ఒడ్డుపల్లె, పల్లెచెరువు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథములపై ఇందూ



ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పూర్వము భారతదేశంలో ఆత్మజ్ఞానులు సంపూర్ణంగా వుండే వారని ఆత్మజ్ఞానం కలవారంటే ఇందు జ్ఞానం కలవారని అందుకే భాతర దేశాన్ని ఇందూ దేశమని పిలిస్తున్నారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుని మన దేశానికి పూర్వవైభవం తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉమాశంకర్, దేవరాజులు, హేమంత్, ధర్మేష్, హర్షవర్ధన్, కిట్టూ, రాజేంద్ర,లలిత, విమలమ్మ, లత, భానుమతి, శాంతమ్మ, చిట్టెమ్మ, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త



స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు బూత్ స్థాయి అధికారులు 2023 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారి నుంచి కొత్తగా ఓటు నమోదుపై ఫారం 6 దరఖాస్తులు స్వీకరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను అనుసరించి దరఖాస్తులను 160 మంది నుంచి స్వీకరించినట్లు తహశీల్దార్ పద్మావతి చెప్పారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ నెల 8వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని చెప్పారు.

## నాంచారమ్మ పేటలో 'ఇదేం ఖర్మ' కార్యక్రమం

చిల్లకూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్య క్రమం నాంచారమ్మ పేటలో నిర్వహించారు. నాంచారమ్మపేట గ్రామంలో నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు నిరుద్యోగ సమస్య, పెరిగిన నిత్యావసరసరుకులు, ఇసుకమాఫియా, తాగునీటి సమస్య, మహిళలకు భద్రత కరువు, విద్యుత్ అధిక చార్జిలు....రైతులకు అందని ఎరువులు.... ఇవ్వడం లేదని తదితర అంశాలపై ముద్రించి కరపత్రాలను పంపిణీ చేస్తు వారి సమస ్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాలన ఎలావుంది. ఈ ప్రభుత్వ పాలనలో ఎలా ఉంది అని వారిని అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని విషయాలు వారితో చర్చించారు. రాబోయే ఎన్నికలలో వైసిపికి ప్రజలకు సరైన గుణపాఠం చెబుతారని 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, మండలపార్టీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లరెడ్డి, పార్టీనాయకులు పచ్చా వెంకటేశ్వర్లునాయుడు, ఎగనపర్తి భాస్కర్‌రెడ్డి, మునిశేఖర్‌గౌడ్, మేకల కుమార్, శ్రీధర్‌రెడ్డి, చిరంజీవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇదేమి సర్దుబాటు !

కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త

జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు అనుసరి స్తున్న విధానాలపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా సబ్జెక్టు టీచరు ఒక్కరూ లేని పాఠశాలలకు సమీపంలో అదనంగా ఉన్న చోట నుంచి టీచర్లను నియమించాలని విద్యాశాఖ కమిషనర్ ఇటీవల ఆదేశాలిచ్చారు. దీనికి కొన్ని సవరణలు చేస్తూ తాజా ఉత్తర్వులిచ్చారు. ఆ ప్రకారం 3, 4, 5 తరగతులు విలీనం చేసిన ఉన్నత పాఠశాలల్లో కూడా సబ్జెక్టు టీచర్లను నియమించాలని మండల స్థాయిలో ఎస్‌జిటిల సర్దుబాటు



కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఏ మండలంలో ఉన్న వారిని అక్కడే సర్దుబాటు చేయాలని, లభ్యం కాని పక్షంలో డివిజన్ స్థాయిలో ఎక్కడ అవసరమైతే అక్కడ నియమించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా డిఇఒ కార్యాలయంలో కసరత్తు పూర్తి చేసి జాబితా తయారు చేశారు. ఆ సమాచారం తెలిసి కొందరు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆ మండలంలో లేకపోతే సమీపంలోనియమించాలని,అలాకాకుండామూడునాలుగుమండలాలఅవతలదాదాపు60కిలోమీటర్లదూరంలోడిప్యుటేషన్‌వేస్తేఎలావెళ్లాలనిప్రశ్నిస్తున్నారు .

### యూనియన్ల అభ్యంతరం

ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు రద్దు చేయాలని, పదోన్నతులు పొందిన వారికి స్థానాలు కేటాయిం చాలనిరాష్ట్రబిటిఎప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు.సర్దుబాటుపేరుతోసీనియారిటీ పాటించకుండా ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు వేయడానికి బిటిఎ ఖండిస్తుందని చెప్పారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర బిటిఎ ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోఆయనమాట్లాడుతూఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రశాఖ మద్దతు ప్రకటించిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి రమణారెడ్డి గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ కృష్ణ, సులోచనరాణి, ప్రసన్న రాజా పాల్గొన్నారు.

## బోడిలింగాలపాడు ఆలయం జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

తడ, డిసెంబర్ 4 ప్రభాతవార్త



తడ మండలం బోడి లింగాల పాడు లోని భువనేశ్వరస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు ఆదివారం ఉదయం ప్రారంభిం చారు. హరహర శంక ర నినాదాలతో తడ కండ్రిగ, తడ, బోడి లింగాలపాడు తదితర గ్రామాల భక్తుల సమక్షంలో ఈ పనులు ప్రారంభించారు. పురాతనమైన ఆలయం ఇటీవల బాగా దెబ్బతినడంతో గ్రామస్థులంతా కూడబలుక్కొని జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ఆలయానికి పునర్వైభవం తీసుకురావడానికి ఆదివారం ఉదయం గ్రామపెద్దలతో పాటు అర్చక స్వాములు కలిసి పనులు మొదలుపెట్టారు. దివ్య కలశాలలో నీటిని తెచ్చి అభిషేకించి పనులు మొదలుపెట్టారు. సూళ్లూరుపేటకు చెందిన న్యాయవాది తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తడకండ్రిగ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి ఏడుమలైరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజకీయాలకు, కులాలకు అతీతంగా ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## 4వ తేదీ ముగిసింది.. ఖాతాల్లో కానరాని వేతనం

కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త

డిసెంబర్ వచ్చింది.. నాలుగు రోజులు ముగిశాయి.. ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ కాలేదు. జిల్లా వ్యాప్తంగా 19 ఉపఖజానా కార్యాలయాలు ఉన్నాయి. అన్ని రకాల బిల్లులు ప్రభుత్వానికి అందాయి. కానీ నేటికీ జీతాలు తమ ఖాతాల్లో జమ కాలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 29, 30 తేదీల్లో సర్వర్ నెమ్మదించిందని చెప్తున్నారు. అయితే ఖజానా శాఖలో ఏ ఒక్క బిల్లు కూడా పెండింగ్‌లో లేదని చెప్తున్నారు. అన్ని బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు ఖజానా ఉద్యోగులు పేర్కొంటున్నారు.కానీనాలుగోతేదీ ముగిసినా ఉద్యోగులకు వేతనాల చెల్లింపు జరగకపోవడం గమనార్హం. ఆర్థికశాఖ పరిధిలో ఉండే ఏపీ జీఎల్ఐ ఆడిట్ పే అండ్ అకౌంట్స్, పోలీస్, జలవనరుల శాఖ ఉద్యోగులకు వేతనాలు అందాయి. ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్ల వేతనాలు, పెన్షన్లు ఇంతవరకు జమ కాలేదు. సీఎఫ్ ఎంఎఫ్ బిల్లు స్టేటస్ వెబ్‌సైట్ పనిచేయడం లేదు. ఈ నెల నుంచి ఆ సైట్ మూసేశారు. ఆ వెబ్‌సైట్ పనిచేసి ఉంటే ఉద్యోగి బిల్లు ఏ స్టేజిలో ఉందో తెలుసుకునే వీలుందని, ఇప్పుడు ఆ అవకాశంలేకుండాపోయింది.దీంతోఉద్యోగులు, పెన్షనర్లు వేతనాల కోసం ఎదురు చూడక తప్పడం లేదు.

## మదర్సా స్థలాన్ని పరిశీలించిన టీడీపీ శ్రేణులు

రేణిగుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:



రేణిగుంట బిస్మిల్లా నగర్ సమీపంలోని మత స్థలాన్ని టీడీపీ నేతలు ఆదివారం పరిశీలించారు. గతంలో అప్పటి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గోపాలకృష్ణారెడ్డి ఈ స్థలాన్ని మదర్సా కోసం ఇచ్చినట్లు టీడీపీ నేతలు అంటున్నారు. ఈ స్థలాన్ని రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు అప్రోజ్, పార్టీ సీనియర్ నేతలు కొరియర్ రవి, కన్ననరెడ్డి తదితరులు పరిశీలించారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగరాజు

నాయుడుపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త

నాయుడుపేటలోని సుందరరామిరెడ్డి భవన్‌లోని సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ల యూనియన్ తిరుపతి జిల్లా మొదటి మహాసభలు కిష్టమ్మ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై మోడీ ప్రభుత్వంలో దాడులు అధికంగా జరుగుతున్నాయని, 44 కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా కార్మికులంతా ఐక్యంగా ఉద్యోగ భద్రత కోసం



పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలో ఆశా కార్యకర్తలు సమర్ధవంతంగా పనిచేయడం వల్ల ప్రజలు ఆరోగ్యపరంగా చైతన్యవంతంగా ఉన్నారని చెప్పారు. అయితే కనీస వేతనాలు అమలు చేయడంలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అనంతరం నెల్లూరు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కార్మికుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం 17 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం జిల్లా కార్యదర్శి విజయమ్మ, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్, సిఐటియు నాయకులు శివకవి, ముకుంద, చాపల వెంకటేశ్వర్లు, మహేష్, గౌస్‌బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలాలు..సాగుభూమికోసం పోరాటాలకు సిద్ధంకావాలి

## -రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త

రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవారికి ఇంటిస్థలం సాగుభూమి కావాలంటే ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని, ఈనెల 21న జరిగే రాష్ట్ర స్థాయి భూసదస్సుకు వేలాదిగా తరలిరావాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులశేఖర్ పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా జనరల్ బాడీ సమావేశం శ్రీకాళహస్తి నియోజకవర్గం వేడాం గ్రామం వేయిలింగాలకోన వద్ద జె.తులసీరాజన్ ఆధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఇంటిపట్టాలు ఇచ్చి ఇండ్లు కట్టించకుండా వదిలేశారని అన్నారు. దేశంలో మొదటగా పేదలకు కూలిరేట్లు పెంచాలని, దున్నేవాడిదే భూమి అనే నినాదం తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మాత్రమే అన్నారు. తిరుపతి జిల్లాలో అనేక భూపోరాటాలు నిర్వహించి వేలాది



ఎకరాలు భూమి పేదలకు పంచిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానిదే అన్నారు. కోనేరు రంగారావు భూకమిటీ 108 సిఫార్సులు చేసినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఇప్పటి వరకు ప్రభుత్వాలు పేదల ఆక్రమణలో ఉన్న భూములకు మాత్రమే పట్టాలిచ్చారే కానీ కొత్తగా ఇచ్చింది ఏమీ లేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్ గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచేశారన్నారు. ఈధరలు ఆకాశాన్నంటిన తరుణంలో పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు. 5న సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నిర్వహించే దిగ్విజయంగా చేయాలని, మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి దిగ్విజయం చేయాలని మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు పెంచలయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాలగురవయ్య, ప్రభాకర్, తులసీరాజన్, బాలకృష్ణ, శివకుమార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో లలిత జిఎం పూజలు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం లలిత బియ్యం జనరల్‌మేనేజర్ పవన్‌కుమార్, సేల్స్ మేనేజర్ శివలు పూజలు జరిపించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో లలిత బియ్యాన్ని ప్రసాదాలు,నిత్యాన్న ప్రసాదానికి వాడుతున్నారు. వారికి ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. లలిత మేనేజ్‌మెంట్‌కు ఆలయంలో దర్శనాలను జరిపించి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా వారికి అంజూరు శ్రీనివాసులు ఆలయం చేపట్టిన కైలాససదన్ ప్యాకేజీలను వివరించారు. రాబోవు రోజుల్లో మేనేజ్‌మెంట్‌తో చర్చించి సహకారం అందిస్తామన్నారు.

## గొడుగుచింత జ్యోతిరావు పూలే పురస్కారం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త



విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, తెలుగుపండితులు, ప్రముఖ కవి, రచయిత గొడుగుచింత గోవిందయ్యకు ఆదివారం చిత్తూరులోని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు భాషకు గ్రహణం వీడేదెన్నడు అన్నఅంశంపై సదస్సు సాహితీవేత్తలకు మహాత్మా జ్యోతిరావు పూలే విశిష్ట పురస్కారాలు అందించారు. ఇందులో భాగంగా ప్రముఖ కవి , రచయిత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొడుగుచింత గోవిందయ్యకు అతిధులల చేతులమీదుగా పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కవులు మత్రిపూడి దేవేంద్రరావు, నారాయణస్వామి, నూకతోటి రాజేష్, కోటేశ్వర మొదలయార్, కథారీ వెంకటరత్నం, యతీష్, రోహిత్, దస్తగిరి, భూపతితదితరులుపాల్గొన్నారు. ఈసందర్భంగా గొడుగుచింత గోవిందయ్యను పలువురు కవిమిత్రులు, సాహితీప్రియులు పలువురు అభినందించారు.

## శుకబ్రహ్మాశ్రమంలో గీతాజయంతి వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి తీరాన వెలసిన శుకబ్రహ్మాశ్రమం వ్యవస్థాపకులు రచించిన గీతామకరందం ఉత్సవాలను ఆదివారం ఆశ్రమ ఆవరణలో నిర్వహించారు. పీఠాధిపతి విద్యాప్రకాశనందస్వామి భగవద్గీతలోని అంశాలను పండితపామరులకు సులభరీతిలో అర్థమయ్యేలా గీతామకరందాన్ని రచించారు. ప్రపంచ వ్యాప్తంగా గీతాజయంతి సభలను నిర్వహించారు. సుమారు 130 గీతా జయంతి ఉత్సవాలను ప్రపంచ దేశాల్లోని నలుమూలల్లో నిర్వహించారు. గీతామకరందం బహుళభాషలో మేధావుల ప్రశంసలు అందుకుంది. భౌతికంగా ఆయన లేకున్నా ఆయన రచించిన గీతామకరందం నేటికి సజీవంగా మిగిలింది. ఈఉత్సవాలను పీఠాధిపతి విద్యాస్వరూపానంద స్వామి సారధ్యంలో నిర్వహించబడుతోంది. ఆశ్రమంలోని ధ్యానమందిరంలో ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశనందస్వామి పాలరాతి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు చేసిన అనంతరం అలంకరణ చేపట్టారు. సామాన్యులకు సులభంగా అర్థమయ్యేరీతిలో భగవద్గీతను గీతామకరందంగా రూపొందించిన విద్యాప్రకాశనందగిరి స్వామిని స్మరించుకున్నారు. భగవద్గీత సృష్టికర్త అయిన శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పలువురికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## సంకల్పసారధ్యంలో ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 4 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి మండలం ముచ్చి వోలు గ్రామంలో తిరుపతి సంకల్ప ఆసుపత్రి సారధ్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ వైద్యశిబి రానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ప్రజలు చక్కగా సద్విని యోగం చేసుకున్నారు. ముచ్చివోలు గ్రామంలోని జిల్లాపరిషత్‌ఉన్నతపాఠశాల ఆవరణలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కొంత మందికి తిరుపతికి రెఫర్ చేసారు. వారికిఏర్పాట్లను సర్పంచ్ విజయలక్ష్మీ నరసింహారెడ్డిపర్యవేక్షించారు. డాక్టర్ పి. నాగరాజ్‌కుమార్, డాక్టర్ ఆర్ శ్రీకాంత్, డాక్టర్ అనంతనాగ్, డాక్టర్ కె సురేష్‌లు పాల్గొని వైద్యపరీక్షలు జరిపారు.

## 13,14న ఏడు గంగమ్మ జాతర

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడుగంగమ్మల జాతరను ఈ నెల 13,14న నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో స్థావరమైన ముత్యాలమ్మగుడిలోని ఏడుగంగమ్మల స్థావరం ఆలయం వద్ద ఏర్పాట్లులో నిర్వాహకులు తలమునకలై ఉన్నారు. అంతేకాక ఏడు చోట్ల నిర్వాహకులు ఎవరి పరిదిలో వారు ఏర్పాట్లు చేపట్టారు. రెండేళ్ళు కోవిడ్ నిబంధనలతో ఏకాంతంగా జరిపిన జాతరను ఈ ఏడాది భారీ ఎత్తున నిర్వహించుటకు నిర్వాహకులు సిద్దమయ్యారు. ఈ ఏడాది దేవస్థానం కూడా జాతర నిర్వహణలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు.

## విషజ్వరంతో వ్యక్తి మృతి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త

పట్టణంలోని కెంపల్లికి చెందిన ఎస్.బాలకృష్ణ కుమారుడు ఎస్.రమేష్(44) విషజ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యజమాని మృతి చెందడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారుతుందని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## ధ్యానం ఆధ్యాత్మిక అభ్యాసాల్లో ఒకటి

పుత్తూరురూరల్, డిసెంబరు 4 ప్రభాతవార్త:



త్రినేత్ర పిరమిడ్ ధ్యానమందిరంలో జరుగుతున్న ధ్యానం అంతర్గత జాగరూకత కార్యక్రమం జరుగు తుంది. ఈ కార్యక్రమానికి తాడిపత్రి నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ మాస్టర్ లక్ష్మికాంతమ్మ మాట్లాడుతూ ధ్యానం అన్నది అత్యంత విస్తారంగా పరిశోధన చేయబడుతుదన్న ఆధ్యాత్మిక అభ్యాసాల్లో ఒకటి అన్నారు. ఆత్మజ్ఞానాన్ని భావోద్వేగ పరమైన స్వేచ్చను మానసిక పని తీరును మరి దయాగుణాన్ని పెంపొందించుకోగలిగే అంతర్గత జాగరూకతను అందుకోవడానికి ధ్యానం మనకు ప్రధానంగా శిక్షణను ఇస్తుంది. అందుకే ప్రపంచాన్ని ధ్యాన-సాకాహారమయం చేయాలన్న గొప్ప బాధ్యతన చేపట్టి పని చేస్తున్న పిరమిడ్ మాస్టర్లు అందరూ సహనానికి మారుపేరుగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, జయచంద్రన్, గిరివర్మ, సుకన్య, మల్లీశ్వరి, పురుషోత్తంశెట్టి, ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రద్దు చేసిన వైసీపీ

- గాలి భానుప్రకాష్



నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త:

ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు అని చెప్పి నేడు కాలనీల్లో బలవంతపు వసూలు చేయడం, దళిత, గిరిజనులను ఇబ్బంది పెట్టడం, ఎస్సీ, ఎస్టీలకు ఖర్చు చేయాల్సిన వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు రద్దు చేసి ఆ వర్గాలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం నగరి రూరల్ మండలం తడుకుపేట, వీఎన్ఆర్ పేట పంచాయతీల్లో మీ కోసం-మీ తెలుగుదేశం కార్యక్రమంలోపాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులు రద్దు చేసి ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం హయాంలో ఎస్సీ, ఎస్టీలకు పక్కా గృహాల నిర్మాణంకు రూ.2.50 లక్షల రూపాయలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తే, నేడు ఒక్క ఇల్లు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. నిత్యావసర ధరలు అదుపులేక రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేక, రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రాక నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ఇదేం కర్మ అంటూ ఇంటింటా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమం కొనసాగించారు. ప్రజల సమస్యలు, కష్టాలు తీరాలంటే తెలుగుదేశంను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు, కామేష్, సురేష్, చంద్రనాయుడు, ప్రభాకర్‌నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, మాజీ సర్పంచ్ మధునాయుడు, శివయ్య, నాగరాజురెడ్డి, చెంగారెడ్డి, నియోజకవర్గ ఐటీడీపీ అధికార ప్రతినిధి బాలాజీ, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి మీర, నియోజకవర్గ మహిళా అధికార ప్రతినిధి, మండలమహిళాఅధ్యక్షురాలు లక్ష్మి, స్వప్న, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల మీట్‌లో సభ్యులు తీరు అమానుషం

: టీడీపీ నాయకులు



వెదురుకుప్పం,డిసెంబర్ 4 ప్రభాతవార్త :

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవోపై ఎంపి టీసీ పరుష పదజాలంతో మాట్లాడటం అమాను షమైన చర్య అని తెలుగు దేశం పార్టీ నాయకులు ఖండించారు. సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల తీరుపై ఆదివారం టీడీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు క్రమశిక్షణ లేదని ఇష్టానూ సారం మాట్లాడటం సాధారణమని ఆరోపించారు. నిధులు పంపిణీలో సమ న్యాయం చేయలేదని ప్రశ్నించడం తప్పులేదని ఒక మండల స్థాయి అధికారిని సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన తీరు సరిగాలేదని విమర్శించారు. నిధులు కేటాయించడం మండల అధ్యక్షులు, ఎంపిడివోలు సమన్వయంతో చేయవలసినపని అని, అందుకు కేవలం ఎంపిడివోను మాత్రమే బాధ్యులు చేయడం సరికాదన్నారు. ఇకనైనా సభ్యులు తమ మాటతీరును మార్చుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బట్టే చాణిక్య ప్రతాప్, నాయకులు నరసింహ యాదవ్, వెంకట రమణా రెడ్డి, గురసాల కిషన్ చంద్, జయచంద్రా తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘంకు జాతీయ గుర్తింపు హర్షణీయం

వెదురుకుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



రైతు సంఘానికి జాతీయ గుర్తింపు లభించడం హర్షణీయమని రైతుల సంఘం నాయకులకు, రైతులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని భాంతం మిట్ట వద్ద నందీశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘం జాతీయ నాయకులు కుమారస్వామి మాట్లాడుతూ రైతులు తాము పంటించిన పంటలకు గిట్టుబాటు ధర రాబట్టడంతోనే లాభాలు వస్తాయని చెప్పారు. వ్యవసాయం పంటలు సాగు మెలకువలు, ఆదాయన్ని పెంచడం అభివృద్ధి పథంలో నడవడానికి కావలసిన అంశాలను ఉదాహరణలతో వివరించారు. అభివృద్ధికి మండల వ్యవసాయాధికారుల సహకారంతో పాటు బ్యాంకుల సహకారం తీసుకోవడం ద్వారా ముందుకువెళ్ళవచ్చనిచెప్పారు. నందీశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ రవినాయక్‌ను అభినందించిన డిఎం

తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

తిరుపతి ఆర్టీసీ డ్రైవర్ రవి నాయక్ నిజాయితీకి డిపో మేనేజర్ అభినందించారు. తిరుమల నుంచి తిరుపతికి ఆదివారం ప్రయాణిస్తున్న ఒంగోలుకు చెందిన భక్తులు నాగిరెడ్డి దంపతులు తమ పర్సును మరిచిపోయారు. గుర్తించిన డ్రైవర్ రవి నాయక్ నగదు గల పర్సును తిరుపతి డిపో సెక్యూరిటీ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మురళి, డ్యూటీ కానిస్టేబుల్ చిరంజీవి, సహాయంతో డిపో మేనేజర్ బాలాజీకి అందజశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్ నిజాయితీని అభినందించారు. పర్సు మరిచిపోయిన బాధితులకు వారి నగదు పర్సును అందజేశారు.

## నిత్యాన్న ప్రసాదానికి తిరుమల వాసుల విరాళం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి తిరుమల వాసులు ఆదివారం విరాళం అందించారు. ఇక్కడ నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. మన జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా విశేష సంఖ్యలో భక్తులు నిత్యాన్న ప్రసాదానికి విరాళాలు అందిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆదివారం తిరుమలకు చెంది వి.రాజేశ్వరి కుటుంబసభ్యులతో కలసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి నిత్యాన్న ప్రసాదానికి విరాళం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె రూ.లక్షలు అందించారు. వారికి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రత్యేక దర్శనం, వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో బోర్డు సభ్యులతో పాటు ఆలయాధికారులు మల్లికార్జున్ ప్రసాద్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసరాజు, హరియాదవ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘన

తిరుపతి (విద్య), డిసెంబర్ 4, ప్రభాతవార్త

అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 16 డేస్ యాక్టివిజంలో భాగంగా మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళ అధ్యయన విభాగం, కేంద్రం ఆధ్వర్యంలో జెండర్ బేస్డ్ వయలెన్స్ ఎహ్యూమన్ రైట్స్ ఇష్యు అనే అంశం పైన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఆడిపిల్ల పుట్టుక నుండే అనేక రకాలైన వేధింపులు, హింసలు, దాడులు, అసమానతలు ఎదుర్కొంటూ, ఆత్మనూనతా భావానికిలోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీటిని అరికట్టే ప్రయత్నంలో ప్రతి సంవత్సరం నవంబర్ 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినంగా పాటించాలని 1999న ఐక్య రాజ్యసమితి ఒక తీర్మానాన్ని చేసింది. దేశంలోని 16 విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా నవంబర్ 25 నుండి డిసెంబర్



10వ తేది వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందని, ఇందులో భాగంగా మహిళ విశ్వవిద్యాలయం హైబ్రిడ్ మోడ్‌లో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మహిళా అధ్యయన ఇంచార్జ్ విభాగాధిపతి డాక్టర్. నీరజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన మహిళా అధ్యయన విభాగ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కృష్ణ కుమారి, ప్రొఫెసర్ సంధ్యారాణి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న భారతావనిలో ఈ నాటికి స్త్రీ పురుషుల మధ్య అసమానతలు కొనసాగడం శోచనీయమన్నారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరం జెండర్ గ్యాప్ నివేదిక - 2022 ప్రకారం, స్త్రీ పురుషుల సమానత్వంలో జాబితాలోని 146 దేశాల్లో భారత్ 135వ స్థానంలో ఉందన్న వాస్తవాన్ని గుర్తు చేశారు. అనంతరం ఎక్స్పర్ట్ స్పీకర్ ప్రొఫెసర్ సీతా కుమారి మాట్లాడుతూ జెండర్ బెస్ట్ వైలెన్స్ గ్లోబల్ సమస్యగా పేర్కొన్నారు. సోషలైజేషన్ ప్రొసెస్‌లో మార్పు రానిదే అనేక రకాల లింగ అసమానతలను రూపు మాపడం కష్టం అన్నారు. చట్టాలపైన అవగాహన పెంచుకోవాలని, పురుషులలో చైతన్యం కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హైమావతి, ఉమాదేవి, రాణి, చైతన్య, ప్రభ, ప్రీతి సుచరిత, భువనేశ్వరి తదితరులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## చంద్రబాబు సిఎం అవుతారని ఆశలు వద్దు

: వైకాపా నేత సుమన్‌కుమార్



నారాయణవనం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పగటి కలలు కంటున్నారని సత్యవేడు నియోజకవర్గ వైకాపా యువ నాయకుడు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ అన్నారు. ఆదివారంనారాయణవనంలోజరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెవిబిపురం మండలం మాజీ మండల టిడిపి అధ్యక్షులు మునస్వామియాదవ్ పగటి కళలతో ఎవేవో మాట్లాడుతున్నారన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం ఖాయమనా న్నరు. సిఎం అమలు పరుస్తున్న పథకాలే మళ్లీ జగనన్నను సిఎంను చేస్తుందన్నారు. టిడిపి పార్టీ ఎన్టీఆర్‌తో ముగిసిందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలఆశలు పెట్టుకోవద్దన్నారు. చిత్తూరు, తిరుపతి జిలాల్లో మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో 14 స్థానాల్లోను వైకాపా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## జాతీయ రహదారిని కప్పేస్తున్న ముళ్లకంపలు

-రోడ్డుకు ఇరువైపు కనిపించని లెవల్ క్రాసింగ్.. - ప్రమాదాలబారిన వాహనచోదకులు

-పట్టించుకోని అర్అండ్‌బి, నేషనల్ హైవే అధికారులు



నారాయణవనం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారికి ఇరువైపులా మొలచిన మొక్కల రోడ్డును కప్పేయడంతో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అలాగే పుత్తూరు నుంచి సత్యవేడు వరకు హైవే రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. మరమ్మతు పనులు చేసిన నేషనల్ హైవే అధికారులు రోడ్డుకు ఇరువైపుల మొలచిన మొక్కలను తొలగించడం లేదు. దీంతో ఈ ముళ్ల కంపలు రోడ్డును కప్పేయడంతో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. పుత్తూరు నుంచి సత్యవేడు వరకు సుమారు 65 కిలోమీటర్ల దూరం వున్నది. సుమారు 19ఏళ్ల క్రితం ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చారు. ఈ మార్గంలో ప్రతిరోజు వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే సమయంలో రహదారికి ఇరువైపుల మొలచిన మొక్కలను తొలగించడాన్ని నేషనల్, అర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు పుత్తూరు నుంచి ఊతుకోట వరకు నేషనల్ హైవే అధికారులు నిర్మించిన బ్రిడ్జిలపైన అధిక సంఖ్యలో మట్టి చేరి వున్నది. ఈ మట్టిని తొలగించకపోవడంతో బ్రిడ్జి మరమ్మతుకు గురవుతున్నది. అధికారులు దీన్ని కూడా గమనించి మట్టిని తొలగించిబ్రిడ్జికాపాడాలని కోరుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ముళ్లకంపలను తొలగించడంతో పాటు బ్రిడ్జిపై పేరుకు పోయిన మట్టిని కూడా తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందన

కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్ డిసెంబర్ 4, ప్రభాతవార్త

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 5వ తేది ఉదయం 10 నుండి 11 వరకు డయల్‌యువర్ కమిషనర్ కార్యక్రమం, 11 నుండి 12 గంటల వరకు నేరుగా అర్జీలు, పిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. 0877-2227208 నంబర్‌కి కాల్ చేసి తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చు అని నేరుగా వచ్చి అర్జీలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు.

## చెత్త తొలగించే వాహనం ప్రారంభం



నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త :

మునిసిపల్ పరిధిలో చెత్త సేకరణ నిమిత్తం ఏర్పాటు చేసిన నూతన చెత్త తొలగించే వాహనాన్ని (స్మాల్ కంపాక్టర్) చైర్మన్ పి.జి.నీలమేఘం ఆదివారం ప్రారంభించారు. మునిసిపల్ కార్యాలయ ఆవరణలో వాహనాన్ని వుంచి పూజలు చేసిన అనంతరం వాహనాన్ని వీధుల్లోకి పంపారు. ప్రజారోగ్య సంరక్షణలో భాగంగా వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఇ నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భూపాల్, సెక్రటరీ పురుషోత్తం, నాయకులు రమేష్ రెడ్డి, ఎఇలు రమేష్, నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రహరీ గోడపై నుంచి పడి విద్యార్థి మృతి

నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త :



మునిసిపల్ పరిధిలోని సత్రవాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడపై నుంచి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఎస్ఐ శివశంకర్ తెలిపిన మేరకు... శనివారం పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థి ఢిల్లీ ప్రకాశం(12) సహ విద్యార్థులతో కలిసి ఆడుకుంటూ పాఠశాల ప్రహరీ పక్కనే వున్న చెట్టు పైన ఒక కాలు, గోడపై మరో కాలు వేసి ఆడుకుంటుండగా అదుపు తప్పి ప్రహరీకి అటు వైపు పడిపోయాడు. విద్యార్థులంతా ఇంటికి వచ్చేసినా తమ పిల్లవాడు రాకపోవడంతో తల్లితండ్రులు పీతాంబరం, పూంగోడి అతన్ని పలు ప్రాంతాల్లో వెతికారు. ప్రహరీ గోడ వద్ద ఆడుతున్నాడని కొందరు చెప్పగా అక్కడకు వెళ్లిన వారికి ఒంటిపై రక్తపు మరకలతో పడి వున్న కుమారుడు కనిపించాడు. లబోదిబోమంటూ కొన ఊపిరితో వున్న కుమారుడిని స్థానికంగా వున్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. నగరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించగా ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

## ప్రజలే దేవుళ్లు.. ప్రజా సేవే సర్వస్వం - మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:



ప్రజలే దేవుళ్ళని ప్రజాసేవ సర్వస్వంగా భావిస్తున్నానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీలోని పన్నీరు కాలువ, కొత్త మంగళం, ఎస్ఆర్ పట్టెడ, వెంకట్‌రెడ్డి కండ్రిగ తదితర ప్రాంతాల్లో ఆదివారం విస్తృతంగా పర్యటిం చారు. గ్రామస్తులు గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. లబ్ధిదారులకు వెంటనే లబ్ధి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఎంపీడీవో హరిబాబు, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, ఎస్ఐ ధర్మారెడ్డి, స్థానిక ఎంపీటీసీ ఆనందరావు, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, మండల వైకాపా మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, మైనారిటీ ఉపాధ్యక్షుడు షబీర్ అహ్మద్, రేణిగుంట పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నాగేషం, వైకాపా సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, గురవరాజుపల్లి రహీం, రహింతుల్లా, రేణిగుంట మండల ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ, మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, స్థానిక వార్డు మెంబర్లు, స్థానిక నేతలు, ఎమ్మెల్యేతో పాటు ఉన్నారు.

## మండల వైసిపి నూతన కమిటీ ఎన్నిక

విజయపురం, డిసెంబరు 4 ప్రభాతవార్త :



మండల వైసిపి నూతన కమిటీని ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలోమంత్రిక్యాంప్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వైసిపి అధ్యక్షుడిగా ఇల్లత్తూరుకు చెందిన గోపినాథ్, ఉపాధ్యక్షుడిగాఎం.అగరానికిచెందిన బాలకృష్ణా నాయుడు, ప్రధాన కార్యదర్శిగా జగన్నాధపురానికి చెందిన మునికృష్ణ, మహిళా అధ్యక్షురాలిగా జ్యోతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రమేష్, బిసి సెల్ అధ్యక్షుడిగా పాండ్యన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కుప్పారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మునిరత్నం, బిసి సెల్ ఉపాధ్యక్షుడిగా హరికృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడిగా కుప్పయ్య, న్యాయ సలహాదారుగా బాబులను ఎన్నుకున్నారు.

## నేరపకోట వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 4 ప్రభాతవార్త:



నేరపకోట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ, మార్కెట్ కాలనీ వీధుల్లో సర్పంచ్ ఆరణి విశ్వనాథరెడ్డి ఆదేశాల మేరకు వీధుల్లో రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలను తొలగించారు. ఆ గ్రామ ప్రజలు ఆ పిచ్చి మొక్కల వల్ల ఇబ్బందులు పడడంతో సర్పంచ్‌కి సమాచారం తెలిపారు. దీంతోసర్పంచ చొరవచూపిసెక్రటరీకిఈసమాచారం తెలియజేశారు. వర్షాలుతరచూ పడుతున్నడడంతో రకరకాల మొక్కలు ఏపుగా పెరిగి దోమలు, పాములు బెడద అధికం కాకుండా నివారించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు.

## కల్యాణవెంకన్న సన్నిధిలో ఏకాదశి ఉత్సవ సందడి

నారాయణవనం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో ఆదివారం ఏకాదశి ఉత్సవంతో భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపైఅధిరోహించిఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలనడుమ స్వామి, అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## తెలుగుభాషకు గ్రహణం వీడెదెన్నడు..?

**రాష్ట్రపతి అవార్డు గ్రహీత డా.సి.నారాయణస్వామి**



సాహితీవేత్తలకు మహాత్మాజ్యోతిరావు పూలే పురస్కారాలను ప్రదానం చేస్తున్న మర్రిపూడి దేవేంద్రరావు

చిత్తూరురూరల్, డిసెంబరు 4 ప్రభాతవార్త:
తెలుగుభాషకు పట్టిన గ్రహణం వీడాలంటే ప్రజల చొరవతోనే సాధ్యమని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా.సి.నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక పలమనేరు రోడ్డులోని సమాఖ్య కార్యాలయంలో సమాఖ్య వ్యవస్థాపకులు మర్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో తెలుగుభాషకు గ్రహణం వీడెదెన్నడు..? అన్న అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటికి తెలుగుజాతీ పరాధీనపు భాషలోనే మగ్గడం సిగ్గుపడాల్సిన విషయమని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన ఆనాటి నుంచి అధికారభాషగా తెలుగు అమలు లక్ష్యానికి ఆమడదూరంలోనే వుందన్నారు. రాష్ట్రాలలో తెలుగుభాషకు అంతగా ప్రాధాన్యత లేనప్పుడు తెలుగు అకాడమీ, అధికారభాషా సంఘం, ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమీ వంటి ప్రభుత్వ సంస్థల కార్యకలాపాలు ఎందుకని ప్రశ్నించారు. అలాగే పూలే పురస్కారాలను సంఘసేవకులకు, సాహితీవేత్తలకు ప్రదానం చేయడం మర్రిపూడి దేవేంద్రరావు కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డా.సి.నారాయణస్వామి, డా.జి.శాంతకుమారి, గొడుగుచింత గోవిందయ్య, కొఠారి వెంకటరత్నం, డా.కందిపాటి చక్రపాణి, తోటగోవిందన్, సంఘసేవకులు నూకతోటి రాజేష్, బి.కోటీశ్వరమొదలిఆయర్, టి.యస్. యతీష్, భూపతి, ఎస్.సప్తగిరి, రోహిత్‌కుమార్‌లకు మహాత్మాజ్యోతిరావు పూలే పురస్కారాలను మర్రిపూడి దేవేంద్రరావు ప్రదానం చేసారు.

## కృష్ణం వందే జగద్గురుం!

**-గోవిందుని చెంత కృష్ణభగవానుడి నామస్మరణ**



తిరుమల, డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:
ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భావించాడని పురాణాల ఐతిహ్యం. అదే విశ్వాసంతో తిరుమలలో నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం సాగిన భగవద్గీత అఖండపారాయణంలో శ్రీకృష్ణుని నామంతో 'కృష్ణం వందే జగద్గురుం"అంటూ పండితులు సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, ఎస్వి వేదవిశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, ధర్మగిరి వేదపాఠశాల ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ అవధాని, వేదపండితులు నరసింహాచార్యులు, మారుతి, రామానుజం, రాఘవేంద్ర, భక్తులు పాల్గొన్నారు. చివరగా పండితులు ఇఓ దంపతులకు వేదాశీర్వచనం చేశారు.

## గణనాధుని సేవలో సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్

కాణిపాకం, డిసెంబర్ 4 ప్రభాతవార్త:



ప్రముఖ సినీ గాయకుడు, సేవ్ టెంపుల్ స్ట్రస్ట్ ఛైర్మన్ గజల్ శ్రీనివాస్ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టం బాబు తదితరులు పాల్గొన్నారు.

## గాయకుడు సోము ఉమాపతికి సన్మానం

తిరుపతి, డిసెంబర్ 4ప్రభాతవార్త:



తిరుపతికి చెందిన సీనియర్ నేపధ్యగాయకుడు సోము ఉమాపతిని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకల్లో భాగంగా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతు న్నాయి. ఆదివారం భవానీనగర్ కూడలిలోని ఘంటసాల విగ్రహానికి అబిషేకం చేసి పూలతో ముంచెత్తారు. ఘంటసాల తన స్వరకల్పంతో జనాన్ని మంత్రముగ్ధుల్ని చేశారని, తేనెలూరు గళంతో ఎన్నో ఆధ్యాత్మిక, సినీ గేయాలను, సంగీతాన్ని ప్రజలకు అందించారన్నారు. ఘంటసాలతో తరచూ పాటలు పాడించుకుని ఆనందించే చిత్తూరు నాగయ్య, బిఎన్‌రెడ్డి తమ సినిమా స్వర్గసీమలో తొలిసారి నేపధ్యగాయకుడిగా అవకాశమిచ్చారని, 116 రూపాయలు పారితోషికం ఇచ్చారన్నారు. అనంతరం ఎన్నో పాటలు పాడిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొందు రామచంద్రారెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, ఆర్కే కృష్ణ, నాగరాజుశర్మ, చంద్రారెడ్డి, జేజిరెడ్డి, ఉపాధ్యాయుడు తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలోని వాటర్‌ట్యాంక్ తొలగింపు



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 4 ప్రభాతవార్త
తిరుపతి పాత నగర పాలక సంస్థ కార్యాలయంలో వున్న వాటర్‌ట్యాంక్‌ను ఆదివారం రాత్రి తొలగించారు. గతచాలాకాలంగా ఈ ట్యాంక్ నగర ప్రజలకు నీటిని అందించింది. పాత కార్యాలయంలో తొలగింపుతో ట్యాంక్‌ను తొలగించారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అపూర్వ స్వాగతం



రేణిగుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:
రాష్ట్ర పర్యటనలో భాగంగా తిరుపతి తిరుమలలో పలు కార్యక్రమాల్లో పాల్గొనుటకు రాత్రి 9.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘన స్వాగతం లభించింది. ఉప ముఖ్యమంత్రి ఎక్సైజ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదాలో శ్రీ కె.నారాయణస్వామి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవాదాయశ్శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయ, రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్(సీఎస్ ప్రతినిధి), డా. రవిశంకర్ ఏపీ అదనపు డీజీపీ శాంతి భద్రతలు మంగళగిరి(డీజీపీ ప్రతినిధి), జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, తిరుపతి ఎఈస్ప ఎస్.పరమేశ్వర్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబరు జి.భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్రపతికి స్వాగతం పలికారు. జాతీయ టూరిజం, డీవోఎన్ఈఆర్ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్రపతి వారితో పాటుగా వచ్చి తిరుపతి జిల్లా పర్యటనలో పాల్గొంటారు.

## మినీ రాజీవ్‌నగర్‌లా బీడికాలనీ

**-ఈనెల 21న సామూహిక గృహప్రవేశాలు**
**-ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ**



మండలంలో ఇంటి నిర్మాణాలు దృశ్యం

తొట్టంబేడు, డిసెంబర్ 4 ప్రభాతవార్త
నిరుపేదల కల నెరవేరబోతోంది. ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు అందరికీ ఇంటిస్థలాలు అందించేందుకు రంగం సిద్దంచేశారు. ఏళ్ళ తరబడి అభివృద్ధికి నోచుకోని బీడికాలనీలో ఇంటిస్థలాలు అందించేందుకు ఎంఎల్ఏ ఆదేశాలతో తహశీల్దార్ సుధీర్‌రెడ్డి పరుగులుతీస్తున్నారు. ఈనేపథ్యంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో నిరుపేదలైన లబ్దిదారులను గుర్తించి ఇంటిస్థలాలను అందించారు. మండలంలో మొత్తం 1325మంది లబ్దిదారులను గుర్తించి వారికి ఇంటిస్థలాలను అందించేందుకు చర్యలుతీసుకుంటున్నారు. ప్రతి ఒక్క లబ్దిదారునికి 1.50సెంట్లు స్థలాన్ని అందిస్తుండగా, మరోసెంటు స్థలంరోడ్డు కోసం కేటాయించారు. పట్టా మాత్రం 1.50సెంటుకే ఇస్తారు. ఎకరాకు 40మంది చొప్పున లబ్దిదారులకు పట్టాలు అందిస్తున్నారు. ఈసందర్భంగా తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, హౌసింగ్, ఎంపిడిఓలు కలసి తమ సిబ్బందితో మండలంలో ఉన్న 27 గ్రామ పంచాయతీల్లోని నిరుపేద లబ్దిదారులను గుర్తించడంతోపాటు స్థలసేకరణ చర్యలుతీసుకున్నారు. వివాదాలు ఉన్న చోట తహశీల్దార్ పరిష్కరించి ఇప్పటికే స్థలానికి సంబందించి సర్వేరాళ్ళు నాటారు. గతంలో బీడికాలనీలో నిర్మించిన ఇళ్ళలో ఎవ్వరు ఉండలేని పరిస్థితి నెలకొనడంతో అవిపాడుబడిపోయాయి. దీంతో శిధిలావస్థకు చేరుకున్న ఇళ్ళను నేలమట్టంచేసి ఆప్రదేశాల్లో కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఇక్కడ సివిల్‌సప్లయిస్‌గోడౌన్ నిర్మాణం పూర్తయింది. ఇక పక్కనే మరోగోడౌన్ నిర్మాణం జరుగుతోంది. తొట్టంబేడు పంచాయతీకి చెందిన నిరుపేదలు 200మందికి పట్టాలు అందిస్తున్నారు. పంచాయతీల వారీగా పరిశీలిస్తే కాసరం 98, పిల్లమేడు 65, పెద్దకనపర్తి 87, చియ్యవరం 127, చోడవరం 2, గుండేలిగుంట 30, పూడి 5, శేషమనాయుడుకండ్రిగ 10, పెన్నలపాడు 10, కొణతనేరి 40, ఇలగనూరు 9, పొయ్య, లింగమనాయుడుపల్లి 100, రౌతుసూరమాల 39, తాటిపర్తి 17, తంగేళ్ళపాళెం 57, సాంబయ్యపాళెం 23, కారాకొల్లు 30, చిట్టత్తూరు 72, కంచనపల్లి 21, బోనుపల్లి 46, చిన్నసింగమాల 39, పెద్దకన్నలి, కొత్తకండ్రిగ, బసవయ్యపాళెం 104, తొట్టంబేడు 179మందికి పట్టాలను అందించారు. అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటినిర్మాణాలు పూర్తయిన వాటిని ఈనెల 21న సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం అత్యధికంగా మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బీడికాలనీ ఓ మినీ జగనన్న కాలనీలగా తయారైంది. ఇక్కడి కాలనీకి నీటిని అందించడంలో సర్పంచ్ సుబ్బయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో కాలనీలో ఇంటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక మరికొన్ని ఇంటినిర్మాణాలు పూర్తయ్యాయి.

## అరాచక పాలన వద్దు.. సైకిల్ పాలన ముద్దు

**మాజీ మంత్రి అమరనాథరెడ్డి**

గంగవరం, డిసెంబరు 4, ప్రభాతవార్త :
గడిచిన మూడన్నర సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నిర్వీర్యం చేసి అవినీతి, అరాచకాలకు అంతేలేకుండా పోయిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై మండిపడ్డాడు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పిలుపు మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం మండలంలోని కీలపట్లలో సర్పంచ్ చంద్రశేఖర్ ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన వద్దని సైకిల్ పాలనే ముద్దని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అందిస్తున్న పాలనలో ప్రజలు ఇబ్బందులు, కష్టాలను వారి సమస్యలను ప్రతి ఇంటికి వెళ్ళి అడిగి తెలుసుకొని అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ రాష్ర్టంలో పుట్టిన వ్యక్తి ఈ రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టకుండా రాష్టనికి తరిమికొట్టిన జగన్ పాలనలో యువతకు ఉద్యోగాలు ఎలా



వస్తాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని సర్పంచులను బిచ్చగాళ్ళను చేశారని వారికి కల్పించాల్సిన రాజ్యాంగ హక్కులపై మాట్లడితే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యుత్ చార్జీలను దపాలు పెంచారని, వ్యవసాయ బోర్లకు మీటర్లు అమర్చి రైతులను ముంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నిత్యవసర ధరలు పెరుగుదల ఆకాశాన్ని తాకాయని, సామాన్యులు ఏ వస్తువులు కొనలేని స్థితిలో ఉన్నారని, రాష్ట్రంలోని ప్రజలు పెట్రోల్‌కు, డీజల్‌కు, మద్యంకు పక్క రాష్ట్రం కర్ణాటకకు పోతున్నారని, ఇక్కడ ఖనిజ సంపద ఇసుకను కర్ణాటకకు ఎగుమతి చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగం, మహిళపై పెరిగిన అఘాయిత్యాలు, అత్యాచారాలు, క్షీణించిన శాంతి భద్రతలు, ప్రభుత్వ అసమర్థ, అవినీతి, అరాచకాలు రాజ్యమేలడమే కారణం అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతోమమేకమై వారు పడుతున్న కష్టాలను గుర్తించి వారికి అండగా ఉంటూ ప్రజల్లోకి తీసుకెళ్తూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీ, మాజీ ఎంపిటిసి మొగిలిరెడ్డి, నాయకులు గంగవరం, నారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.చిన్నబ్బ, భాస్కర్‌రెడ్డి, గవిమఠం లోకేష్, కె.నాగరాజగౌడు, బాలాజీ, సూరి, హరి, దేవేం ద్రరెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, సర్దార్, మార్కొండ, యుగంధర్, రెడ్డెప్పలు పాల్గొన్నారు.

## రైతుభేరి యాత్రకు అడ్డంకులు

**-కారు నిర్బంధంలోనే రామచంద్రయాదవ్**



రామచంద్రయాదవ్ కారును అడ్డుకొన్న పోలీసులు, సిబ్బంది

పుంగనూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :
జనసేన పార్టీ గత ఎన్నికల నియోజకవర్గ అభ్యర్థి బి.రామచంద్ర యాదవ్ సదుంలో ఆదివారం తల పెట్టిన రైతుభేరి యాత్రకు పుంగనూరులో ఆదివారం అడ్డంకులు ఎదురయ్యాయి. యాక్ట్ -30 అమలులో ఉన్నందున ఆయన సభకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అనుమతి నిరాకరించారు. అయితే ఈనేపథ్యంలో ఆయన హైకోర్టుచే సభ నిర్వహణకు అనుమతి లభించింది. ఆదివారం మధ్యాహ్నం సదుంలో రైతు భేరి జరగాల్సి ఉండగా ఉదయం నుంచి పుంగనూరు పట్టణంలో రామచంద్రయాదవ్ ఇంటివద్ద పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. సిఐ మదుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మోహన్‌కుమార్ ఉదయం రామచంద్రయాదవ్‌కు రైతుభేరికి వెళ్ళడానికి అనుమతి లేదంటూ పోలీసు నోటీస్ జారీ చేశారు. అయితే హైకోర్టు అనుమతి ఉన్నందున ఎవరు ఆపినా తాను ఆగేది లేదని పేర్కొం టూ మధ్యాహ్నం 2గంటలకు ఆయన తన ఇంటినుంచి బయలుదేరి కారులో బయలుదేరారు. పెద్ద ఎత్తున మొహరించిన పోలీసులు ఆయన కారుకు అడ్డుగా నిలబడి వెళ్ళడానికి వీలులేదని శాంతిభద్రత లకు విఘాతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దాదాపు మూడు గంటల సేపు ఆయన కారులోనే కూర్చుండిపోయారు. జనసేన లీగల్ అడ్వజయిర్ డేవిడ్ మనోహర్ పోలీసులతో మాట్లాడుతూ హైకోర్టు అనుమతి ఉన్నప్పటికి ఎందుకు అడ్డుకొంటున్నారని ప్రశ్నించారు. సాయంత్రం 5గంటల వరకు ఆయ నకు అనుమతి లభించకపోవడంతో ఆయన జిల్లా ఎస్పిను ఫోన్‌లో సంప్రదించా రు. ఎట్టకేలకు సభా సమయం పూర్తి అయిన తరువాత ఆయనను సాయంత్రం 5.30గంటలకు సిఐ మధుసూదన్‌రెడ్డి ఎస్పి సూచనల మేరకు పట్టణంలో వెళ్ళడానికి అనుమతించారు. సాయంత్రం 5.30గంటలకు ఆయన అనుచరులు, మద్దతుదారులతో ప్రదర్శనగా వెళ్ళి అంబేద్కర్ విగ్రహానికి వినతి సమర్పించారు. రైతుభేరి యాత్ర వల్ల శాంతిభద్రతల సమస్య వస్తుందనే ఉద్దేశ్యంతోనే తాము ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతి ఇవ్వలేదని మదసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో ఈ సంఘటనతో జనసేన, రామచంద్రయాదవ్ అభిమానులు ఆయన ఇంటి వద్ద గుమికూడి తమ నాయకున్ని అనుమతించకపోవడం పట్ల అసంతృప్తిని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనకంటి శాంబమూర్తి, అనీల్‌కుమార్, రమేష్‌లతో పాటు ఆయన మద్దతుదారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గీతా జయంతి వేడుకలు



బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 4 ప్రభాతవార్త:
శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో గీతా జయంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని గీతామందిరం ప్రారంభోత్సవం, కుంభాభిషేకం ఉత్సవ వేడుకలను సహజ స్వచ్ఛంధ సంస్థ సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత దేవాదాయశాఖ కమిషనర్ బలరామయ్య, రాష్ట్ర పరిశ్రమల సంచాలకులు డా. జి.సృజన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతామందిరం ప్రారంభోత్సవం కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దీంతో బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఐఏఎస్ బలరామయ్య సుఖశాంతులు లభిస్తాయని తెలియజేశారు. ఈగీతామందిర నఇర్మాణ పనులు పూర్తి చేశారని, ఎల్లప్పుడూ సంస్థ మానవాళి సుఖసంతోషాలతో జీవించగలగాలి అనే భావంతో తాత్వికతను బోధిస్తూ ముందు తాను పాటిస్తూ అందరికి మార్గదర్శిగా నిలుస్తున్న సురేష్‌నాయుడుకు కృతజ్ఞతలతో ప్రశంసించారు. అనంతరం విశ్రాంతి ఎస్సీ రమేష్‌నాయుడు, ఏ.సుధాకర్‌రెడ్డి, విశ్రాంతి దేవాదాయశాఖ కమిషనర్ బలరామయ్య, పలువురిని ఘనంగా సన్మానించారు. యోగా గురువు సురేష్‌నాయుడు మాట్లాడుతూ సమస్త మానవాళి స్వార్థ చింతన వీడి సుఖసంతోషాలతో జీవించాలన్నదే తమ బోధనల సారాంశమని తెలియజేశారు. గీతామందిర నిర్మాణంలో సహకరించిన గ్రామస్థులందరికి, వై.మునెయ్యనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ పాఠశాల, పూజిత బాలికల కశాశాల కరస్పాండెంట్ సహజ, గీతాజ్ఞాన పీఠాధిపతి శివానంద గిరి స్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లక్ష దీపోత్సవానికి భారీ ఏర్పాట్లు

వెదురుకుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని వెదురుకుప్పం ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో ఎంపీపీ నాగరాణి హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థపకులు ప్రతాఫ్ స్వామీజీ నేతృత్వంలో డిసెంబర్ 6న మంగళవారం కార్తీకమాస కృత్తిక నక్షత్రంలో లక్ష దీపోత్సవ కార్యక్రమానికి భారీ ఏర్పాటు చేస్తున్నారు. రెండు మూడు రోజులుగా లక్ష దీపోత్సవ కార్యక్రమంకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను ఆదివారం ప్రతాప్‌స్వామీజీ, హేమసుందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో ఆనందంగా ఉండాలని తలపెట్టిన మహాయజ్ఞం లాంటిదని భక్తులు సహకరించి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్ది రామచంద్రా రెడ్డి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డప్ప, టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవీ సుబ్బా రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ వైఎస్‌ఛైర్మెన్ విజయానంద రెడ్డి, జిల్లా జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు, శ్రీశైలం దేవస్థానం ఛైర్మెన్ చక్రపాణి రెడ్డి, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ ఏకాంబరం, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటిసీలు హాజరవుతారని చెప్పారు.

## శ్రీనిలయలో... ప్రభుత్వ భూమి ఆక్రమణకు పకడ్బందీ ఏర్పాట్లు

**- భూ ఆక్రమణలు తెలియకూడదనే దర్జాగా కాల్వలో గేట్లు ఏర్పాటు**

తిరుపతిరూరల్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలంలో రూ.కోట్లాది విలువ చేసే ఖరీదైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైతున్నాయి. మండల పరిధిలో వున్న వంకలు, వాగులు, డికెటి, అనాధీనం, కాల్వపోరంబోకు, వంకపోరంబోకు, కశం గడ్డలు తదితర భూములు రోజురోజుకు కనుమరుగైతున్నాయి. తాజాగా తిరుపతిరూరల్ మండలం చిగురువాడ ఉత్తరపు కండ్రిగలో కోట్లు విలువ చేసే ఖరీదైన అనాధీనం భూమిని స్వాహా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిగురువాడ పంచాయతీ పరిధిలో 2010లో 18.65 ఎకరాలలో శ్రీనిలయ తుడా అప్రూవల్ లేఅవుట్‌ను ఏర్పాటు చేసారు. ఈ లే అవుట్‌లో ప్రవేట్ భూములతో పాటు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ లే అవుట్‌లో 11.15 ఎకరాలు ప్లాట్స్, 4.475 ఎకరాలు రోడ్లు, 1.87 ఎకరాలు పార్కు, 0.95 ఎకరాలు బఫర్‌జోన్ కింద ఉంది. శ్రీనిలయ లేఅవుట్‌లో ప్రవేట్ భూములతో పాటు, ప్రభుత్వ భూముల చుట్టూ ప్రహారీ ఏర్పాటు



కాల్వలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన గేట్లు

చేసారు. లే అవుట్ లోపల ఉన్న కాల్వ, అనాధీనం భూముల ఆక్రమణ, భూ కబ్జా బయటకు తెలియరాదనే దురుద్దేశంతోనే 137 సర్వే నెంబర్‌లో గల కాల్వలో గేట్లను పకడ్బందీగా అమర్చారు. శ్రీనిలయ లే అవుట్‌లో ఏమి జరుగుతున్నా బయట వ్యక్తులకు తెలియకూడదనే పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్రీనిలయలో కోట్లు రుపాయాలు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ లే అవుట్‌లో సర్వే నెంబర్ 138-1లో 1.94 ఎకరాలు కాల్వ, 139-1,2లలో 2.83 ఎకరాలు కాల్వ పోరంబోకు స్థలాలు ఉన్నట్లు సమాచారం. 10 అంకణాల స్థలం పట్టా ఉంటే మరో 70 అంకణాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్రీనిలయ లే అవుట్‌లో ఉన్న ప్రభుత్వ భూమి గుర్తించి, ప్రజా అవసరాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైన రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి కోట్ల రుపాయాలు విలువ చేసే ప్రభుత్వ భూమి కాపాడాలని కొరుతున్నారు.